మార్కెట్ చైర్మన్ ఖరారయ్యేనా?

- 18 నెలలుగా తాత్సారం
- పార్టీ సమావేశంలో ప్రకటించాలని నేతల డిమాండ్
- త్వరలోనే ప్రకటిస్తానని ఎమ్మెల్యే హామీ



చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

చెన్నూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదన్నర కావస్తున్నా చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇంకా ఖరారు కాలేదు. ఈ పదవి బీసీకి కేటాయించినా, ఎమ్మెల్యే నాన్చుడు ధోరణి అవలంబించడంపై అంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొంటున్నారు. గతేడాది చైర్మన్ పదవీ ప్రకటిస్తే ఈపాటికి పదవీ కాలం పూర్తయ్యేది. 18 నెలలుగా ఎవరికి ఇవ్వకుండా తాత్సారం చేయడం పట్ల ఆ పార్టీ నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పోటీల్లో చాలామంది..

చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవీని పార్టీ సీనియర్ల నుంచి జూనియర్ల వరకు చాలామంది పోటీపడుతున్నారు. ఎవరికీ వారు తమకే వస్తుందని ధీమాతో ఉన్నారు. ఈనేపథ్యంలో పదవీ ఖరారు చేస్తే పార్టీలో వర్గాలు ఏర్పడి పార్టీకి నష్టం జరుగుతుందా అనే ఆలోచనలో ఎమ్మెల్యే ఉన్నట్లు చెన్నూర్ ప్రాంతంలో చర్చ సాగుతోంది. ఇప్పటికే కాంగ్రెస్‌లో ఆధిపత్యపోరు పట్ల అంతర్గత కుమ్ములాటలు నడుస్తున్నాయి. ఇటీవల సంస్థాగత ఎన్నికల దరఖాస్తుల స్వీకరణలో పార్టీ అబ్జర్వర్ల ఎదుట ఇరువర్గాలు ఘర్షణ పడిన విషయం తెలిసిందే.

ఎందుకు ఆలస్యం..

చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఇటీవల జరిగిన సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు నూకల రమేశ్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఖరారు విషయంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. పదవుల ఆలస్యంతో నాయకులు, కార్యకర్తల్లో పార్టీపై నమ్మకం సన్నగిల్లుతుందని బహిరంగంగా పేర్కొన్నారు. పదవులు ఇస్తే పార్టీని నమ్ముకుని ఉన్నవారికి న్యాయం జరుగుతుందని చెప్పారు.

ఆశావహుల్లో ఉత్కంఠ

చెన్నూర్‌లో ఇటీవల జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మార్కెట్ చైర్మన్ వెంటనే ప్రకటించాలని కోరారు. త్వరలోనే ప్రకటిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. చైర్మన్ పదవీ ఎవరిని వరిస్తుందోనని ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది.

మొక్కలు నాటి సంరక్షించాలి


అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు అన్నారు. అమృత్ మిత్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలో విమెన్ ఫర్ ట్రీస్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో స్వయం సహాయక సంఘ సభ్యులతో విస్తారంగా మొక్కలు నాటించాలన్నారు. నాటిన ప్రతి మొక్కను కాపాడటానికి తోడ్పడాలన్నారు. ఇందుకు గాను తగిన ఆర్థికసాయం అందిస్తామన్నారు. మున్సిపల్ మేనేజర్ మజార్, ఆర్వో ప్రవీణ్, మెప్మా అధికారులు సునీల్, దుర్గయ్య, సీఓ కిశోర్, పర్యావరణ ఇంజనీర్ సంతోష్, మెప్మా రిసోర్స్‌పర్సన్లు, స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉత్తమమైనది


మాట్లాడుతున్న తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి

జన్నారం: ఉపాధ్యాయ వృత్తి ఉత్తమమైనదని తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న శిక్షణ శిబిరాన్ని శుక్రవారం సందర్శించి మాట్లాడారు. మండలంలో అంకితభావంతో పనిచేసిన ఉపాధ్యాయులను చూశానని తెలిపారు. ఇక్కడి పాఠశాలల ఉపాధ్యాయుల పనితీరు బాగా నచ్చిందన్నారు. రాష్ట్రంలో పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించిన మండలంగా జన్నారం పేరు తెచ్చుకుందన్నారు. ఇందుకు కృషి చేసిన ఎంఈవో ఎస్.విజయకుమార్‌ను తహసీల్దార్ సన్మానించారు. ఈ సందర్భంగా ట్రైనింగ్ ముఖ్య అంశాలను తహసీల్దార్‌కు ఎంఈవో వివరించారు. రిసోర్స్‌పర్సన్ రాజారావు, శ్రీనివాస్ నరసయ్య శ్రీనివాస్, వామన్ కుమార్, శ్రీధర్, బద్రీ నాయక్, శ్రీధర్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు


ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, రైతులు

తాండూర్: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని తాండూర్ సీఐ కుమారస్వామి హెచ్చరించారు. తాండూర్ పోలీసులు, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నకిలీ విత్తనాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి ఐబీ వరకు ర్యాలీ తీశారు. ఐబీ సెంటర్‌లో భారీఎత్తున మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ నకిలీ పత్తి విత్తనాల వల్ల భూసారం దెబ్బతింటుందన్నారు. క్రమంగా పంటదిగుబడి తగ్గుతుందని తెలిపారు. వ్యవసాయ అధికారులు సూచించిన మాదిరిగా పత్తి సాగు చేసుకోవాలన్నారు. ఎవరైన నకిలీ విత్తనాలు అమ్మితే సమాచారం ఇవ్వాలన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో సుష్మ, ఎస్సై కిరణ్‌కుమార్, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి


బీమా చెక్కు అందిస్తున్న శంకర్

దండేపల్లి: ఉపాధ్యాయుల సమస్యల సాధనతోపాటు, వారి సంక్షేమానికి పీఆర్టీయూ కృషిచేస్తోందని సంఘం జిల్లా అధ్యక్షుడు కొట్టె శంకర్ అన్నారు. మండలంలోని వెల్గనూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు రమబిందు ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. ఆమె పీఆర్టీయూ క్రియాశీల సభ్యురాలు కావడంతో రాష్ట్ర శాఖ ఆమెకు ప్రకటించిన రూ.లక్ష బీమా సంబంధించిన చెక్కును శుక్రవారం దండేపల్లిలో ఆమె భర్త ప్రభాకర్‌కు అందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బచ్చ మోహన్‌రావు, గౌరవ అధ్యక్షులు కొండు జనార్దన్, మండల అధ్యక్ష, కార్యదర్శులు రావనవేని రవి, మల్యాల మల్లేశ్, నాయకులు రాజమౌళి, సురేందర్, నరసింహులు, సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ


మాట్లాడుతున్న ఏడీఏ సురేఖ

భీమిని: మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను ఏడీఏ సురేఖ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు ఎరువులు కొనుగోలు చేసిన సమయంలో విధిగా బిల్లులు ఇవ్వాలని, షాపుల ఎదుట ధరల పట్టిక ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం లక్ష్మీపూర్‌లో రైతులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రైతు గుర్తింపు నమోదు చేసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలు, గ్లైసిల్ విత్తనాలు వాడి మోసపోవద్దన్నారు. ఏవో యమున దుర్గ, ఏఈవో వినోద్ కుమార్, రైతులు ఉన్నారు.

13 కుట్టుమిషన్ల పంపిణీ


కుట్టుమిషన్లు అందజేస్తున్న కెరోలిన్ విగ్

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ సహృదయ కుట్టుశిక్షణ కేంద్రంలో శిక్షణ పూర్తిచేసుకున్న 13 మంది మహిళలకు ఔట్‌రిచ్ మ్యాప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ సెక్రటరీ కెరోలిన్‌విగ్ మాట్లాడుతూ మహిళలు కుట్టు పనిద్వారా స్వయం ఉపాధి పొందవచ్చన్నారు. దీంతో కుటుంబానికి ఆసరాగా నిలుస్తారని చెప్పారు. సంస్థ సభ్యుడు చంద్రమోహన్ పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌కు విద్యార్థిని ఎంపిక

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లి మదర్‌థెరిసా పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థిని సురిమిల్ల నిత్యప్రవస్థి సైనిక్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబర్చింది. ఈసందర్భంగా ఆమె ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా కలికిరి సైనిక్ పాఠశాలకు ఎంపికైందని పాఠశాల ప్రిన్సిపాల్ అనూప్, మేనేజర్ షైన్ తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

మార్కెట్ రోడ్ల విస్తరణతో మేలు


మాట్లాడుతున్న గుండ సుధాకర్

మంచిర్యాలటౌన్: పట్టణంలోని మార్కెట్ ఏరియాలోని రోడ్ల విస్తరణతోపాటు అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, అండర్‌గ్రౌండ్ కేబ్లింగ్‌తో విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు కృషిచేసిన ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుతోనే ప్రజలకు మేలు జరుగుతుందని మంచిర్యాల చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గుండ సుధాకర్ అన్నారు. జిల్లాకేంద్రంలో శుక్రవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ రోడ్ల విస్తరణ కోసం రూ.78 కోట్ల నిధులు కేటాయించడంతో, ఇకపై మంచిర్యాల మార్కెట్ ఏరియాలో ట్రాఫిక్ సమస్య ఉండదని అన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ శ్రీనివాస్, సభ్యులు మంగిలాల్ సోమాని, జుగల్ కిశోర్ వ్యాస్, తాగరి సుధాకర్, మాదంశెట్టి సత్యనారాయణ, దొంతుల ముఖేశ్, సంఘం జగదీశ్, రావుల మహేశ్ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల ఆకలి కేక మహాసభ విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న గాజుల ముఖేశ్‌గౌడ్

పాతమంచిర్యాల: హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ఈనెల 27న నిర్వహించే చలో హైదరాబాద్ ఆటోడ్రైవర్ల ఆకలికేక మహాసభను విజయవంతం చేయాలని రాష్ట్ర ఆటో జేఏసీ ప్రణాళిక చైర్మన్ గాజుల ముఖేశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. గిరాకీ లేక ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఆటో కార్మికులకు ప్రభుత్వం ప్రతీనెల రూ.12 వేలు ఇవ్వాలని, రూ.వెయ్యి కోట్లతో ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆటోకార్మికులు ఈ మహాసభకు తరలిరావాలని కోరారు. ఆటో యూనియన్ నాయకులు మురళీధర్, మధుకర్, అంజయ్య, రాజేష్, షఫీ, శ్రీనివాస్, గట్టయ్య పాల్గొన్నారు.

జాతీయ రహదారి అధ్వానం


గుడిపేట శివారులో రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు


దొనబండ జాతీయ రహదారిపై ప్రమాదకరంగా రక్షణ గోడ లేని కల్వర్టు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని జాతీయ రహదారి 63 అధ్వానంగా మారింది. వేంపల్లి నుంచి ముల్కల్ల, రాపల్లి, హాజీపూర్, దొనబండ వరకు ఉన్న జాతీయ రహదారి అస్తవ్యస్తంగా మారింది. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వేంపల్లి శివారు నుంచి మొదలు ముల్కల్ల, గుడిపేట వరకు అక్కడి నుంచి హాజీపూర్ మండలం దొనబండ శివారు వరకు ఉన్న జాతీయ రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు పెరిగిపోయాయి. రాకపోకలు సాగించేవారికి ఇబ్బందులు మొదలయ్యాయి. ముళ్ల, చెట్లపొదలతో రోడ్డు ఇరుకుగా మారి వాహనాలు పక్కపక్క నుంచి వెళ్తున్నాయి. ఇక మూలమలుపుల వద్ద ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి. దీంతో ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

మిషన్ భగీరథ గుంత..

హాజీపూర్‌లో మిషన్ భగీరథ పైప్‌లైన్ జాతీయ రహదారిపై నుంచి రోడ్డుకు మరోవైపుగా వేసేందుకు గుంత తీశారు. పైప్‌లైన్ వేశాక పూడ్చాల్సిన గుంతను నిర్లక్ష్యంగా మూసివేశారు. అదే విధంగా ముల్కల్ల నుంచి దొనబండ వరకు ఉన్న కల్వర్టులు ఎలాంటి రక్షణ గోడలు లేకుండా ఉన్నాయి. ఎలాంటి ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు ఇప్పటికైనా పట్టించుకుని రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- శ్రీరాంపూర్ జీఎం ఎం.శ్రీనివాస్


టీ షర్టులు అందిస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: పిల్లలు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని శ్రీరాంపూర్ జీఎం ఎం.శ్రీనివాస్ తెలిపారు. శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 25 రోజులు ఇక్కడ క్రీడా శిక్షణ శిబిరాన్ని దిగ్విజయంగా నిర్వహించినట్లు తెలిపారు. ఫుట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్‌లో శిక్షణ ఇచ్చామన్నారు. ఉత్సాహంగా పిల్లలు హాజరయ్యారన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు టీ షర్టులు అందజేశారు. కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) అరవిందరావు, స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి పాల్ సృజన్, సూపర్‌వైజర్ చాట్ల అశోక్, కోఆర్డినేటర్ ఎస్.నరసయ్య, ఇండోర్ కెప్టెన్ తోట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్వార్టర్ కౌన్సెలింగ్..

శ్రీరాంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో చేంజ్ ఆఫ్ క్వార్టర్ కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 339 క్వార్టర్లకు గాను 348 మంది ఉద్యోగులు హాజరయ్యారు. ఇందులో 74 మంది ఉద్యోగులు చేంజ్ ఆఫ్ క్వార్టర్‌లో క్వార్టర్లు పొందారు. కార్యక్రమంలో ఏరియా ఇన్‌చార్జి ఎస్ఓటూ జీఎం శ్రీధర్, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎంలు అరవిందరావు, ఆనంద్ కుమార్, డీవైపీఎంలు ఎం.రాజేశ్వరరావు, దేవేందర్‌రెడ్డి, సీనియర్ పీవో ప్రణదీప్‌గౌడ్, సీనియర్ అసిస్టెంట్ లక్కాకుల శ్రీధర్ పాల్గొన్నారు.

మార్పులకు అనుగుణంగా సింగరేణి భవిష్యత్తు

శ్రీరాంపూర్: దేశంలో బొగ్గు పరిశ్రమలు, పర్యావరణ పరిరక్షణలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సింగరేణికి భవిష్యత్తు ఆధారపడి ఉందని శ్రీరాంపూర్ జీఎం ఎం.శ్రీనివాస్ తెలిపారు. జీఎం కార్యాలయంలో శుక్రవారం సింగరేణి, స్వణీతి అనే సంస్థ ఆధ్వర్యంలో సింగరేణి భవిష్యత్తుకు రోడ్ మ్యాప్‌పై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గు ఆధారిత పరిశ్రమల మార్పు, దాని ప్రభావం సింగరేణిపై ఎలా ఉంటుందో వివరించారు. స్వణీతి సంస్థ ప్రతినిధి శ్రీరాంకొలాసాని, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకపత్రాలు అందజేత


నియామకపత్రాలు అందుకున్న యువకులు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని జీఎం కార్యాలయం ఆవరణలో 11 మంది డిపెండెంట్లకు జీఎం దేవేందర్ శుక్రవారం ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణిలో ఉద్యోగం దొరకడం అదృష్టంగా భావించి, గైర్హాజరు లేకుండా విధులు నిర్వర్తించాలన్నారు. సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్య సాధనలో నూతన ఉద్యోగులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఆఫీస్ సూపరింటెండెంట్ రాజలింగు, ఏఐటీయూసీ నాయకులు సీపీ రమణ, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్ అందజేత

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఒడ్డు కుమారస్వామి-వినోద దంపతుల కుమార్తె వైష్ణవి హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం చదువుతోంది. సింగరేణి ఉద్యోగుల పిల్లల చదువుకు ప్రోత్సాహంలో భాగంగా శుక్రవారం విద్యార్థిని తల్లిదండ్రులకు రూ. 10 వేల విలువ గల మెరిట్ స్కాలర్‌షిప్ చెక్కును జీఎం దేవేందర్ తన చాంబర్‌లో అందించారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఆఫీస్ సూపరిండెంట్ రాజలింగు, ఏఐటియూసీ నాయకులు రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఆపద్బాంధవుడు

- మూగజీవాల దాహార్తి తీర్చుతున్న రైతు
- అభినందిస్తున్న స్థానికులు


మధు, రైతు


లంబడిపల్లిలో తొట్టిలో నీటిని తాగుతున్న పశువులు

చెన్నూర్‌రూరల్: మూగజీవాలకు దాహార్తి తీర్చుతున్న ఓ రైతు ఆపద్బాంధవుడు అయ్యాడు. నిరాటంకంగా గత పదేళ్లుగా నీటిని అందిస్తూ అందరితో శెభాష్ అనిపించుకుంటున్నాడు మండలంలోని లంబడిపల్లికి చెందిన మద్దె మధు. మూగజీవాల దాహార్తి తీర్చేందుకు గ్రామం చివరిలో ఈజీఎస్ ద్వారా నీటితొట్టిని నిర్మించారు. తొట్టి సమీపంలో రైతు మామిడి తోట సాగుచేస్తున్నాడు. ఈక్రమంలో పైప్‌లైన్‌ను స్వయంగా ఏర్పాటు చేసి సొంత బోరు ద్వారా నీటిని తొట్టిలో నింపి ప్రతీరోజు మూగజీవాల దాహార్తి తీర్చుతున్నాడు. అదేవిధంగా శ్మశానవాటికలో మృతదేహాలకు అంత్యక్రియలు చేసేందుకు వచ్చిన వారు స్నానాలకు నీటిని అందిస్తున్నాడు. స్థానికులు ఆయన్ను అభినందిస్తున్నారు. కాగా మూగజీవాలతోపాటు శ్మశానవాటికకు వచ్చేవారికి నీటి సౌకర్యం అందించడం సంతోషంగా ఉందని రైతు చెబుతున్నాడు.

గోదావరిపై బ్రిడ్జి నిర్మించాలి


ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల అంతర్గాంల మధ్య గోదావరినదిపై బ్రిడ్జిని నిర్మించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని గోదావరినది వద్ద జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, నాయకులతో కలిసి శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మంచిర్యాల గోదావరి నదిపై బ్రిడ్జిని నిర్మిస్తే బస్సుల్లో వెళ్లే వారికి రానుపోను రూ.100 వరకు చార్జీలు మిగులుతాయన్నారు. ఒకవేళ నిర్మించకుంటే ఈ ప్రాంతప్రజలపై ఏడాదిలో రూ.80 నుంచి రూ.100 కోట్ల వరకు భారం పడుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే పదేళ్ల వంతెన నిర్మాణం చేపట్టకుండా కాలయాపన చేస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే తన స్వార్థ ప్రయోజనాల కోసం కమీషన్లకు కక్కుర్తిపడి బ్రిడ్జి నిర్మించకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే.. ముల్కల్ల వద్ద బ్రిడ్జి నిర్మించాలనుకుంటే,నిధులు విడుదల చేసుకోవచ్చన్నారు.మంచిర్యాల వద్ద సైతం బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు రాజ్ కుమార్, పురుషోత్తం, ముఖేశ్‌గౌడ్, సతీశ్‌రావు, మధు, వెంకటకృష్ణ, తిరుపతి, అశోక్‌వర్దన్, శ్రీదేవి, వెంకటరమణరావు, అశ్విన్, వెంకటేశ్వర్‌రావు, సుజాత పాల్గొన్నారు.

ట్రాక్టర్ల వేగ నియంత్రణకు కందకాలు


ముల్కల ఇసుక రీచ్ దారిలో కందకాలు తవ్విస్తున్న పోలీసులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ శివారు ముల్కల్ల ఇసుక రీచ్‌కు వెళ్లేదారిలో ట్రాక్టర్ల వేగాన్ని నియంత్రించేందుకు పోలీసులు వినూత్న ఆలోచన చేశారు. హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ ఆధ్వర్యంలో గనులు, మైనింగ్ శాఖ అధికారులు కలిసి కందకాలను తవ్వించారు. ఇసుక రీచ్ నుంచి జాతీయ రహదారిపైకి వచ్చే సమయంలో ట్రాక్టర్లు అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. దీంతో ట్రాక్టర్ వేగాన్ని కట్టడి చేసేందుకు కందకాలతోపాటు స్పీడ్ బ్రేకర్లు వేయించారు.

టాలెంట్ పరీక్షల్లో ప్రతిభ

జన్నారం: మండలకేంద్రంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మెస్రం నాగరాజు, జుగునాక చంద్రపాల్.. ప్రతిభ టాలెంట్ ప్రవేశపరీక్షల్లో ప్రతిభ కనబర్చారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో ఐఐటీ ఫౌండేషన్ కాలేజీకి జుగునాక చంద్రపాల్, వరంగల్‌లోని ప్రతిభా కళాశాలకు మెస్రం నాగరాజు ఎంపికైనట్లు హెచ్‌ఎం శివరాజం తెలిపారు. ఇంటర్‌లో నాణ్యమైన ఉచిత విద్యతోపాటు, వసతి సౌకర్యం అందుతుందని పేర్కొన్నారు. ఎంపికైన ఇద్దరిని మంచిర్యాల టీటీడీవో జనార్దన్, ఏసీఎంవో రాజమౌళి, పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

ధాన్యం తరలించాలి

వేమనపల్లి: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తరలించాలని ఇన్‌చార్జి తహసీల్దార్ పోశయ్య అన్నారు. మండల కేంద్రంతోపాటు దస్నాపూర్, కొత్తపల్లి, నీల్వాయి, గొర్లపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. వర్షాల నేపథ్యంలో ఎప్పటికప్పుడు ధాన్యం రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. ఆయన వెంట ఆర్ఐ కాలిక్ ఉన్నారు.

కుప్పలు.. తిప్పలు



దండేపల్లి: మండలంలోని పలు గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్కడక్కడ ఇంకా కొంతమేర కొనుగోళ్లు మిగిలిపోయాయి. ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు అక్కడి రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని కాసిపేట-కొండాపూర్ గ్రామాల మధ్య రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కొంతమేర తడిసింది. ఈ ధాన్యాన్ని ఎత్తి మరోచోటకు షిఫ్ట్ చేసి ఆరబోస్తూ అవస్థలు పడ్డారు. ఇంకా ధాన్యం విక్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లో కుప్పలుగా మిగిలిన రైతులకు తిప్పలు తప్పడం లేదు.